సాక్షి
గుంటూరు
మంగళవారం । 4 । ఫిబ్రవరి । 2025



9న శ్రీరామ విజయ మంత్రం

నరసరావుపేటఈస్ట్: ఇస్సప్పాలెంలోని ఆర్యవైశ్య అన్నదాన సత్ర సముదాయంలో ఈనెల 9వ తేదీన శ్రీరామ మంత్ర జపాన్ని చేపడుతున్నట్లు కన్వీనర్ బత్తుల మురళి తెలిపారు.



తామర పూలతో అభిషేకం

పిడుగురాళ్ల: పట్టణంలోని నాగుల గుడి దేవస్థానంలో సోమవారం పంచమి సందర్భంగా మహా సరస్వతి అమ్మవారికి మహాగణపతి పూజ, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు.



ఘనంగా విగ్రహ ప్రతిష్ట

తాడేపల్లిరూరల్: యర్రబాలెంలో ముత్యాలమ్మ తల్లి, పోతురాజు స్వామి వార్ల విగ్రహ ప్రతిష్టా మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు.

కూటమి ఎత్తులు.. జిత్తులు

- నిబంధనలకు నీళ్లొదిలిన అధికారులు
- ఏకపక్షంగా సాగిన ఎన్నికల ప్రక్రియ
- భారీగా మోహరించిన తెలుగుదేశం పార్టీ శ్రేణులు
- ఇది పూర్తిగా అప్రజాస్వామికం : మేయర్, డిప్యూటీ మేయర్ ఆరోపణ

అధికారం అండతో స్థాయీ సంఘం కైవసం

సాక్షి ప్రతినిధి, గుంటూరు/ నెహ్రూనగర్ : అధికారం అండతో కూటమి రెచ్చిపోయింది. పోలీసులు, మున్సిపల్ అధికారులు, ఎమ్మెల్యేల అండతో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో స్థాయీ సంఘం ఎన్నికల్లో గెలుపొందారు. అత్యంత నాటకీయ పరిణామాల మధ్య సోమవారం ఈ ఎన్నికలు జరిగాయి. ఇరువర్గాలు క్యాంపు నుంచి నేరుగా తమ కార్పొరేటర్లను మున్సిపల్ కార్యాలయం వద్దకు తీసుకువచ్చాయి. కూటమి నేతలు మున్సిపల్ అధికారులతో కుమ్మక్కు అయ్యారు. అభ్యర్థులను భయాందోళనలకు గురిచేసేలా ప్రతి బ్యాలెట్‌పై సీరియల్ నంబర్ వేసి ఎవరు ఎవరికి ఓటు వేశారో తెలిసేలా చేశారు. స్థాయి సంఘం ఎన్నిక పూర్తిగా సీక్రెట్ బ్యాలెట్‌లో జరగాల్సి ఉండగా దీనికి భిన్నంగా గుంటూరు మున్సిపల్ అదనపు కమిషనర్ వ్యవహరించడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై వైఎస్సార్‌సీపీ సభ్యులు అభ్యంతరాలు పెట్టినా అధికారులు బేఖాతరు చేశారు.

ఆరుగురు గెలుపు

ఎన్నికల పోటీల్లో నిలబడిన ఆరుగురు కూటమి సభ్యులు(5 టీడీపీ, 1 జనసేన) గెలిచారు.స్థాయి సంఘం ఎన్నిక ఉదయం 10.30గంటలకు ప్రారంభమైంది. మధ్యాహ్నం రెండు గంటలలోపు మొత్తం 56 మంది సభ్యులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మూడు గంటల తరువాత కౌంటింగ్ ఫలితాలు కమిషనర్ పులి శ్రీనివాసులు వెల్లడించారు.

పశువుల మాదిరి కొనుగోలు

2021లో జరిగిన కార్పొరేటర్ల ఎన్నికల్లో కూటమి నేతలు 11 మాత్రమే గెలిచారు. మిగిలిన 44 డివిజన్లలో వైఎస్సార్ సీపీ గెలిచింది. 2021 నుంచి ఇప్పటి వరకు మూడుసార్లు వైఎస్సార్‌సీపీ శ్రేణులే స్థాయీ సంఘం కమిటీ సభ్యులుగా గెలుస్తూ వచ్చారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అధికారం కోల్పోవడంతో సంతలో పశువుల మాదిరి వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, కేంద్ర మంత్రి కొన్ని లక్షలు ఖర్చు పెట్టి కొనుగోలు చేశారు. గత మూడు సార్లుగా ఎప్పుడో బరిలో ఉండని కూటమి నేతలు సోమవారం జరిగిన 4వ స్థాయీ సంఘం ఎన్నికకు పోటీ చేశారు. అయితే, మొత్తం 18 మంది బలం మాత్రమే ఉండగా ఈ వారం రోజుల్లో కొనుగోళ్లకు తెరలేపారు. చివరికి కూటమి తరుపున పోటీ చేసిన అభ్యర్థులకు 31 నుంచి 33 ఓట్లు వరకూ వచ్చాయి. దీనిని బట్టి చూస్తే ఎన్నిక కోసం ఎన్ని కుట్రలు పన్నారో స్పష్టంగా అర్థమవుతుంది. ఒకరి ఓటు చెల్లకుండా పోయింది.



గుంటూరు నగరపాలక సంస్థకు బస్సులో వస్తున్న వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలో చేరిన కార్పొరేటర్లు

భారీగా మోహరించిన టీడీపీ శ్రేణులు

నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం వద్దకు ఉదయం 10.30గంటల నుంచే టీడీపీ, జనసేన కూటమి నేతలు భారీగా చేరుకున్నారు. పశ్చిమ నియోజకవర్గంలో ఓ కాలేజీకి చెందిన విద్యార్థులను కూడా కార్పొరేషన్ కార్యాలయం వద్దకు తీసుకువచ్చారు. ఎలాగైనా హడావుడి చేసి భయాందోళన సృష్టించేందుకు కుయుక్తులు పన్నారు టీడీపీ శ్రేణులు. ప్రధాన కార్యాలయంలోకి కార్పొరేటర్లు, మీడియా వారినే అనుమతించాల్సి ఉండగా..టీడీపీ శ్రేణులను కూడా లోపలకి అనుమతించి హడావుడి చేయించారు. అధికారం ఉందనే అహంతో ఏదైనా సాగుతుందని తమ దర్పాన్ని ప్రదర్శించారు టీడీపీ శ్రేణులు. పోటీ చేసిన ఆరుగురు కూటమి సభ్యులు గెలుపొందడంతో బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు.



గుంటూరు నగరపాలక సంస్థ వద్ద పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

కార్పొరేటర్ల ఇంటికి వెళ్లి కొనుగోలు : మేయర్ కావటి

స్థాయీ సంఘాన్ని ఎలాగైన దక్కించుకోవాలనే ఉద్దేశంతో టీడీపీ ఎమ్మెల్యేలు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల ఇళ్లకు వెళ్లి వారిని సంతలో పశువులను కొన్నట్లు కొనుగోలు చేశారని నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు పేర్కొన్నారు. 15 సంవత్సరాలుగా కార్పొరేటర్‌గా పనిచేసిన అనుభవం ఉన్న నాకు...ఎప్పుడు కూడా స్థాయీ సంఘానికి ఇంత రాద్ధాంతం చూసిన దాఖలాలు లేవన్నారు. కక్కిన కూడుకి ఆశపడినట్లు టీడీపీ నేతలు వైఎస్సార్‌సీపీ సభ్యులను కొనుగోలు చేయడం సిగ్గుచేటని ఖండించారు. స్థాయీ సంఘాన్ని టీడీపీ కైవసం చేసుకునే విధంగా అధికారులు కూడా వ్యవహరించారని ఆరోపించారు. ఇందుకు ఉదాహరణ ఓటర్ కౌంటర్ స్లిప్ పైన, సభ్యులకు ఇచ్చే స్లిప్‌పైన సీరియల్ నంబర్ ఉందని తెలిపారు. దీనిని బట్టి చూస్తే అర్థం అవుతుందన్నారు. ఈ ఎన్నిక అప్రజాస్వామ్యబద్ధంగా జరిగిందడానికి రుజువుగా పేర్కొన్నారు. అసలు సీరియల్ నంబర్లు ఇవ్వాల్సిన అవసరం ఎందుకు వచ్చిందని ఆయన ప్రశ్నించారు.

ఎన్నిక అప్రజాస్వామికం : డెప్యూటీ మేయర్

స్థాయీ సంఘం ఎన్నికకు అధికారులు ఇంత హడావుడి చేయడం చరిత్రలో ఎప్పుడ జరగలేదని డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు పేర్కొన్నారు. 56 మంది ఉన్న సభ్యులకు వందల సంఖ్యలో పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నారంటనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చని తెలిపారు. అధికార పార్టీ తన అధికారాన్ని అడ్డంపెట్టుకుని అధికారుల సహకారంతో ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన ఎన్నికను అపహాస్యం చేశారని మండిపడ్డారు.

అధికారం అడ్డుపెట్టుకుని గెలుపు : ఎమ్మెల్సీ చంద్రగిరి

స్థాయీ సంఘం ఎన్నికల్లో ఎలాగైనా గెలుపొందాలనే లక్ష్యంతో టీడీపీ శ్రేణులు లక్షలు ఖర్చు పెట్టి కార్పొరేటర్లను కొన్నారని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం ఆరోపించారు. అధికారులను అడ్డం పెట్టుకుని స్థాయీ సంఘంలో గెలిచారన్నారు. కార్పొరేటర్‌లను కొనుగోలు చేయడం దారుణం.

పచ్చ నేతల రచ్చ రచ్చ

- స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో బూతు పురాణం
- పోలీసుల పైనా ప్రతాపం



సీఐ అశోక్‌ను నెట్టివేస్తున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు

పట్నంబజారు: గుంటూరు కార్పొరేషన్‌లో సోమవారం స్టాండింగ్ కమిటీ ఎన్నికలు జరిగాయి. ఈ క్రమంలో పెద్దఎత్తున టీడీపీ నేతలు, కార్యకర్తలు భారీగా కార్పొరేషన్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఇష్టానుసారంగా రోడ్డుపై వాహనాలను ఎమ్మెల్యేల దగ్గర నుంచి కార్యకర్తల వరకు అడ్డంగా పెట్టి వెళ్లిపోయారు. దీనితో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. అప్పటికే అక్కడి చేరుకున్న ఉన్న ట్రాఫిక్ పోలీసులు వాహనాలు పక్కన పెట్టుకోవాలని మర్యాదగా చెప్పినా వినలేదు. రికవరీ వెహికల్ వ్యాన్‌లో ఉన్న హెడ్ కానిస్టేబుల్ సాంబశివరావు శివుడి మాలలో ఉన్న నేపథ్యంలో మర్యాదపూర్వకంగానే ప్రవర్తించారు. వాహనాల వల్ల ట్రాఫిక్ నిలుస్తోందని టీడీపీ నేతలకు చెప్పే ప్రయత్నం చేయడంతో ఆయనపై ఇషానుసారంగా వ్యవహరించారు. ఈ క్రమంలో అక్కడే ఉన్న ఈస్ట్ ట్రాఫిక్ సిఐ ఏ. అశోక్ కల్పించుకుని, వాహనాలు పక్కకు పెట్టాలని చెప్పారు. దీంతో ఆయనపై టీడీపీ నేతలు విరుచుకుపడ్డారు. ఏకవచనంతో ''నువ్వు మాకు చెప్పేది ఏంటి?'' అంటూ బహిరంగంగానే ఆయన్ని దుర్భాషలాడారు. ఒక టీడీపీ కార్యకర్త సీఐ అని కూడా చూడకుండా అక్కడ నుండి పక్కకు నెట్టేసిన సంఘటన ప్రతి ఒక్కరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఇంత గొడవ జరిగినప్పటికీ... దుర్భాషలాడినా పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారు. నిస్సహాయ పరిస్థితుల్లో ట్రాఫిక్, బందోబస్తుకు వచ్చిన పోలీసులు అక్కడ నుంచి మారు మాట్లాడకుండా వెళ్లిపోయారు.

న్యూస్‌రీల్

విజయకీలాద్రిపై గరుడ హోమం



తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రం 8వ వార్షికోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉదయం 8.30 గంటలకు ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్ట, గరుడ హోమం అంగరంగ వైభవంగా నిర్వహించామని తెలిపారు. సాయంత్రం 6.30 గంటలకు దేవతాహ్వానం, శేష వాహనంపై స్వామిని ఊరేగించామని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారని ఆయన తెలిపారు.

కనుల పండువగా శ్రీ భావనారుషి కల్యాణం



తెనాలి: స్థానిక షరాఫ్ బజారులోని శ్రీ భద్రావతి సమేత శ్రీభావనాఋషి కల్యాణాన్ని సోమవారం తెల్లవారుజామున వైభవంగా నిర్వహించారు. గత కొద్దిరోజులుగా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. సోమవారం సాయంత్రం పులి వాహనోత్సవం, రాత్రి రాజాధిరాజ మహోత్సవం (రథోత్సవం) జరిపారు. ముందురోజు రాత్రి స్వామికి భృంగీశ్వర వాహనోత్సవం, అమ్మవారికి గజవాహనోత్సవం నిర్వహించారు. ఆయా వేడుకల్లో పద్మశాలీయ బహూత్తమ సంఘం పెద్దలు జొన్నాదుల కృష్ణ సత్యనారాయణ, జొన్నాదుల వెంకట కోటేశ్వరరావు, తాడిపర్తి శివ సత్యనారాయణ వరప్రసాద్, సంఘం గౌరవ అధ్యక్షుడు జొన్నాదుల మహేష్, గౌరవ సలహా సభ్యులు అక్కల శ్రీరామ్, దివి హేమంత్ కుమార్, గుంటి వెంకట్, అధ్యక్షుడు తిరువీధుల సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి పంచుమర్తి భాస్కరరావు, కోశాధికారి గట్టు బాల శ్రీనివాసరావు, ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ యూనివర్సిటీ సీఈవోగా డాక్టర్ మేఘన



చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ సీఈవోగా డాక్టర్ కూరపాటి మేఘన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎం.ఎస్. రఘునాథన్ హాజరయ్యారు. చైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ డాక్టర్ కూరపాటి మేఘన గత పదేళ్లుగా కంటి స్పెషలిస్ట్‌గా సేవలందిస్తూ మంచి పేరు సంపాదించుకున్నారని తెలిపారు. బాధ్యతలను చక్కగా నిర్వహించి యూనివర్సిటీని మరింత వృద్ధిలోకి తీసుకువెళ్లాలని ఆకాంక్షించారు. అనంతరం డాక్టర్ కూరపాటి మేఘన మాట్లాడుతూ సీఈవోగా బాధ్యతలు స్వీకరించడం ద్వారా తనపై మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు. యూనివర్సిటీలోని అన్ని విభాగాలను సమన్వయం చేసుకుని సమష్టిగా సమర్థవంతంగా పని చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. నియమ నిబంధనలు, నైతిక విలువలు పాటిస్తూ ఉన్నత స్థానాలకు తీసుకు వెళ్తానని చెప్పారు. యూనివర్సిటీని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందేలా అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు.

యార్డుకు 1,20,593 మిర్చి బస్తాలు

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 1,20,593 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,05,330 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ.14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,000 నుంచి రూ.14,500 వరకు ధర లభించింది. ఏసీ కామన్ రకం రూ.9,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.8,500 నుంచి రూ.13,000 వరకు ధర లభించింది.

పడిపోతున్న కూటమి గ్రాఫ్

- సమన్వయంతో ప్రజల మనసులు గెలవాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా నూతన కార్యవర్గ తొలి సమావేశంలో జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

తెనాలి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పరువు ప్రతిష్టలు వేగంగా పడిపోతున్నాయని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు అన్నారు. పార్టీ గుంటూరు జిల్లా నూతన కార్యవర్గం తొలి సమావేశం సోమవారం స్థానిక గౌతమ్ గ్రాండ్ హోటల్‌లో నిర్వహించారు. అధ్యక్షత వహించిన అంబటి రాంబాబు మాట్లాడుతూ పార్టీ నూతన కమిటీల్లోని నాయకులు సమన్వయంతో పనిచేస్తే ప్రజల మనసులు గెలవొచ్చని తెలిపారు. కష్టపడి పనిచేసిన నాయకులకు తగిన గుర్తింపు లభిస్తుందని హామీనిచ్చారు. చంద్రబాబునాయుడు ఎన్నికల్లో సూపర్‌సిక్స్ హామీలనిస్తే, పవన్‌కల్యాణ్ గ్యారెంటీ ఇచ్చినట్టు చెప్పారు. సాధ్యంకాదని తెలిసిన బీజేపీ గ్యారెంటీ ఇవ్వలేదని తెలిపారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముందునుంచే తనకు మించి సంక్షేమం ఇచ్చేందుకు ఎవరికీ సాధ్యంకాదంటూ, చంద్రబాబు మాటలు నమ్మొద్దని కూడా చెప్పారని గుర్తుచేశారు. మూడు రాజకీయ పార్టీలు, కులాల కలయిక, ఇచ్చిన హామీలతో కూటమి అధికారంలోకి వచ్చిందని అంబటి రాంబాబు చెప్పారు. అధికార కూటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చని కారణంగా ప్రజలు విసుగుచెందుతున్నారని తెలిపారు. నూతన కమిటీ నాయకులు కసితో, పట్టుదలతో నిరాశా, నిస్పృహల నుంచి బయటకు రావాలని కోరారు.



మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు. వేదికపై రాధిక, వేమారెడ్డి, మురళీకృష్ణ ఎమ్మెల్సీ హనుమంతరావు, శివకుమార్, కిరణ్‌కుమార్ ప్రభృతులు

- ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ నూతన కమిటీ నేతలు సమన్వయంతో వ్యవహరిస్తూ నియోజకవర్గాల్లోని సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని కోరారు.
- తెనాలి మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ, కూటమి ప్రభుత్వాల పాలనలను ప్రజలు బేరీజు వేసుకుంటున్నారనీ, కూటమి పాలకులు చేసిన మోసాన్ని గ్రహిస్తున్నారని చెప్పారు. పా
- మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి మాట్లాడుతూ సొంత క్యారెక్టర్ ఉన్నవారు, అమ్ముడుబోయే బలహీనత లేనివారు, జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండేవారంతా ఇప్పుడు నూతన కమిటీలో ఉండటం సంతోషంగా ఉందన్నారు. .
- పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ నియోజకవర్గంలో గతంలో బోలెడు తప్పులు జరిగాయనీ, పార్టీకి అండగా ఉండేవారిని పక్కన బెట్టారని చెప్పారు. ఆలోపాలను సరిదిద్దుకుని, అర్హులకు పదవులనివ్వడం సంతోషంగా ఉందని తెలిపారు.
- ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం కష్టపడి పనిచేయాలని కోరారు.

తొలుత జిల్లా కమిటీలోని నాయకులు, అనుబంధ కమిటీల అధ్యక్షుల పరిచయం జరిగింది. తెనాలి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు నిమ్మకాయల రాజనారాయణ, షేక్ మస్తాన్‌వలి, సంయుక్త కార్యదర్శి మెట్టు వెంకటప్పారెడ్డి వేదికపై ఉన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డేవిడ్‌రాజు స్వాగతం పలికారు.

మూత'బడి'తో అన్నీ కష్టాలే !

- కాలనీలో ఉన్న బడిని యథాతథంగా కొనసాగించండి
- మా బడి పిల్లల్ని వేరే స్కూల్లో కలపకండి
- రోజూ రెండు కిలోమీటర్లు నడిచి వెళ్లాలంటే కష్టం
- అధికారులకు విన్నవించిన యనమదల ఆర్ఎన్‌సీ స్కూల్ తల్లిదండ్రులు

ప్రత్తిపాడు: తమ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాల పిల్లల్ని, మోడల్ స్కూల్ పేరుతో వేరొక పాఠశాలకు మార్చొద్దని యనమదల రాజీవ్ నగర్ కాలనీ వాసులు అధికారులను కోరారు. కూటమి ప్రభుత్వం 117 జీవోను రద్దు చేయడంతో ఫౌండేషన్, బేసిక్, మోడల్ స్కూళ్లు ఏర్పాటవుతున్నాయి. ఈ నేపథ్యంలో యనమదల హెచ్ఈ ప్రాథమిక పాఠశాలలో 110 మంది విద్యార్థులు ఉండటంతో దాన్ని మోడల్ స్కూలుగా మార్చనున్నారు. దీంతో సంబంధిత పాఠశాలకు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న అదే గ్రామంలోని రాజీవ్ నగర్ కాలనీలో ఉన్న ఆర్ఎన్‌సీ ప్రాథమిక పాఠశాలలో మూడు, నాలుగు, ఐదు తరగతులు చదువుతున్న 19 మంది విద్యార్థులను హెచ్ఈ పాఠశాలలో కలపనున్నారు. ఈ మేరకు మండల విద్యాశాఖ అధికారులు జిల్లా విద్యాశాఖకు ప్రతిపాదనలు పంపడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం ప్రత్తిపాడు ఎమ్మార్సీలో ఎంఈవో సీహెచ్. రమాదేవిని, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె. శివపార్వతిని కలిసి వినతిపత్రాలను అందించారు. తమ కాలనీలోని ఆర్ఎన్‌సీ స్కూల్‌కు, హెచ్ఈ స్కూల్‌కు మధ్య సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉందని తెలిపారు. దారిలో రోడ్డుకు ఇరువైపులా పెద్ద పెద్ద చెరువులు ఉన్నాయని, పిల్లల ప్రాణాలకు ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేశారు. రోజువారీ కూలి పనులు చేసుకుని బతికే పేదలమని, పిల్లలను దూరంలో ఉన్న స్కూల్‌కు పెంపేందుకు రవాణా ఖర్చులు కూడా భరించే స్థితిలో లేమని విన్నవించారు. సానుకూలంగా స్పందించిన అధికారులు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళతామని తల్లిదండ్రులకు చెప్పారు.



ఎంపీడీవోకి సమస్యను విన్నవిస్తున్న యనమదల రాజీవ్‌నగర్ కాలనీ వాసులు

అధికారులు పునరాలోచించాలి



పాఠశాల మార్పుపై అధికారులు పునరాలోచన చేయాలి. రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న బడికి ప్రతి రోజూ పిల్లలను పంపాలంటే అత్యంత కష్టంగా ఉంటుంది. అందులోనూ ఒకటి, రెండు తరగతులను ఇక్కడ ఉంచి, మూడు, నాలుగు, ఐదు తరగతులను వేరే బడిలోకి మార్చితే భవిష్యత్తులో ఈ స్కూల్ కూడా మూత పడే ప్రమాదముంటుంది.

– టి. మరియదాసు (ఎస్ఎంసీ చైర్మన్, ఆర్ఎన్‌సీ స్కూల్)

చెరువులతో భయం



మా పిల్లలు ఇదే ఆర్ఎన్‌సీ పాఠశాలలో చదువుతున్నారు. ఇప్పుడు వారిలో 3,4,5 తరగతులను మోడల్ స్కూల్ అంటూ గ్రామంలోని హెచ్ఈ పాఠశాలలో కలపబోతున్నారు. రెండు కిలోమీటర్లు నడిచి వెళ్లడం కష్టం.అంతేకాకుండా దారిలో రెండు పెద్ద పెద్ద చెరువులు ఉన్నాయి. పిల్లల ప్రాణాలకూ ప్రమాదమే. అధికారులు మా స్కూల్లోనే యథావిధిగా ఒకటి నుంచి ఐదు తరగతులూ నిర్వహించాలి.

–పి. రత్నకుమారి, టి. మరియకుమారి

పోలింగ్ స్టేషన్లను ఖరారు చేయండి

- జాబితాను ప్రధాన ఎన్నికల అధికారికి పంపిస్తాం
- డీఆర్సీ సమావేశ మందిరంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

లక్ష్మీపురం: కృష్ణ,గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి ప్రపోజ్ చేసిన ఆక్సిలరీ పోలింగ్ స్టేషన్లను రాజకీయ పార్టీల ప్రతినిధులు పరిశీలించి ఖరారు చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి కోరారు. కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో సోమవారం ఆమె తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహా, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ గంగరాజు, డీఆర్‌ఓ షేక్ ఖాజావలి, ఆర్డీఓ కె. శ్రీనివాసరావులతో కలసి మాట్లాడారు. జాబితా ఖరారు చేస్తే ప్రధాన ఎన్నికల అధికారికి పంపుతామని తెలిపారు. గుంటూరు జిల్లాలో 118 ఎక్సిస్టింగ్ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. ఇందులో వెయ్యి ఓట్లకు పైనున్న పోలింగ్ స్టేషన్లకు అదనంగా 39 ప్రపోజ్ చేసినట్లు తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏఆర్‌ఓలతో చర్చించి ఎనిమిది ఆక్సిలరీ పోలింగ్ కేంద్రాలను తగ్గించినట్లు కలెక్టర్ వెల్లడించారు. దీని ప్రకారం జిల్లాలో 149 (118+31) పోలింగ్ స్టేషన్ల జాబితాను సీఈఓకు పంపించడానికి ఏఆర్‌ఓలు వెంటనే ప్రపోజల్స్ పంపాలని ఆదేశించారు. మిగిలిన ఏలూరు, కృష్ణ, ఎన్‌టీఆర్ , బాపట్ల , పల్నాడు జిల్లాలో ఆక్సిలరీ పోలింగ్ కేంద్రాల వివరాలు అందిన పిదప కృష్ణా,గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి మొత్తం పోలింగ్ కేంద్రాలను ప్రకటించనున్నట్లు తెలిపారు. నేటి వరకు నమోదు అయిన ఓటర్లలో పురుషులు 2,06,225 మంది, మహిళలు 1,40,344 మంది, ట్రాన్స్ జెండర్స్ 45 మందితో మొత్తం 3,46,614 మంది ఓటర్లుగా నమోదు చేసుకున్నారని కలెక్టర్ వివరించారు.ఈ సమావేశంలో బహుజన్ సమాజ్ పార్టీ తరఫున చిరతనగండ్ల వాసు, భారతీయ జనతా పార్టీ తరఫున చరక కుమార గౌడ్, కమ్యూనిస్ట్ పార్టీ ఇండియా (మార్సిస్ట్) వై.కృష్ణకాంత్, తెలుగుదేశం పార్టీ తరఫున కంచర్ల శివరామయ్య , జనసేన తరఫున గాదె వేంకటేశ్వరరావు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరఫున బిల్లా సునీల్ , ఆమ్ ఆద్మీ తరఫున టి. సేవకుమార్, కలెక్టరేట్ కో–ఆర్డినేషన్ సెక్షన్ పర్యవేక్షకులు మల్లేశ్వరి,ఏఆర్‌ఓలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

పట్నంబజారు: రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని గుంటూరు జిల్లా ఎస్పీ ఎస్. సతీష్‌కుమార్ చెప్పారు. ప్రజలకు రహదారి భద్రత గురించి, ట్రాఫిక్ నియమాల గురించి తెలియపరచడంలో పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ కీలక పాత్ర పోషిస్తోందని వివరించారు. గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీ ఎం. రమేష్, ట్రాఫిక్ సీఐలు సింగయ్య, ఏ. అశోక్ ఆధ్వర్యంలో సోమవారం చుట్టుగుంట సెంటర్‌లో పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్‌ను ప్రారంభించారు. ట్రాఫిక్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సిగ్నల్స్, పబ్లిక్ అడ్రెసింగ్ సిస్టమ్ ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు వేగంగా స్పందించడానికి అవకాశం ఉంటుందని వివరించారు. మణిపాల్ హాస్పిటల్ నేతృత్వంలో ట్రాఫిక్ పోలీసులకు 200 రేడియం జాకెట్లు అందజేశారు. రానున్న వేసవిలో విధి నిర్వహణకు అవసరమైన టోపీలు, కళ్లజోళ్లు, గ్లూకోజ్, తాగునీటి సదుపాయాలను అందజేస్తామని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు.



రేడియం జాకెట్లు పంపిణీ చేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్, డీఎస్పీ రమేష్


క్యాన్సరా..భయం వద్దు !

- స్క్రీనింగ్‌తో ముందస్తుగా గుర్తింపు
- నేడు అందుబాటులో అత్యాధునిక వైద్య సేవలు
- కొన్ని క్యాన్సర్‌లను వ్యాక్సిన్‌తో చెక్
- నేడు వరల్డ్ క్యాన్సర్ డే

పూర్వం రాచపుండుగా పిలిచే క్యాన్సర్ సోకితే చనిపోవడమే జరిగేది. వ్యాధి సోకగానే మందులేదనే భయాందోళనతో పలువురు చనిపోయేవారు. నేడు ఆధునిక వైద్య విజ్ఞానం ఎంతో అభివృద్ధి చెందడంతో క్యాన్సర్‌ను పూర్తిగా నయం చేస్తున్నారు. ప్రాథమిక దశలోనే గుర్తించే అత్యాధునిక వ్యాధి నిర్ధారణ పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. క్యాన్సర్ రాకుండా ముందస్తుగా కట్టడి చేసే వ్యాక్సిన్లు సైతం నేడు మార్కెట్‌లో ఉన్నాయి. యువ క్రికెటర్ యువరాజ్‌సింగ్ వ్యాధి నుంచి కోలుకున్న విషయం తెలిసిందే. వ్యాధిపై అవగాహన కోసం ప్రతి ఏడాది ప్రపంచ వ్యాప్తంగా ఫిబ్రవరి 4ను వరల్డ్ క్యాన్సర్ దేగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

గుంటూరు మెడికల్: మానకుండా ఉండే పుండు, శరీరంలోని ఏ భాగంలోనైనా పెరుగుతున్న గడ్డలు, కణుతులు, అసహజమైన రక్తస్రావం, పెరుగుతున్న పుట్టుమచ్చలు, పులిపిరి కాయలు, మింగడం కష్టంగా ఉండటం, గొంతు బొంగురుపోయి తగ్గకుండా ఉండటం, చాలా రోజులుగా అజీర్ణవ్యాధి తదితర లక్షణాలు ఉంటే తక్షణమే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. పొగాకు ఉత్పత్తుల కారణంగా 40 నుంచి 45శాతం, కాలుష్యం వల్ల 8 నుంచి 10శాతం, మద్యం వల్ల మూడు శాతం వచ్చే అవకాశాలు ఉన్నాయి.


జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్



ఇంటింటికీ వెళ్లి స్క్రీనింగ్ పరీక్షలు

జిల్లాలో నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ ప్రోగ్రాం (ఎన్‌సీడీ) ద్వారా గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి వైద్య సిబ్బంది క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 18 సంవత్సరాలు దాటిన వారికి ఉచితంగా చేస్తున్నారు. అనుమానిత లక్షణాలు ఉన్నవారిని గుంటూరు జీజీహెచ్‌కు రిఫర్ చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 50 మంది క్యాన్సర్ వైద్య నిపుణులు ఉన్నారు. ఒక్కో వైద్యుడి దగ్గర ప్రతిరోజూ 10 నుంచి 20 మంది రోగులు చికిత్స పొందుతున్నారు.

గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందిన వారి వివరాలు

సంవత్సరం	ఓపీ విభాగం	ఇన్‌పేషెంట్లు	ఆపరేషన్లు
2021	5,865	1214	114
2022	13,102	3,391	395
2023	14,648	4,634	753
2024	16,359	5947	823

అందుబాటులో ఆధునిక వైద్యం



క్యాన్సర్‌ను నయం చేసే ఆధునిక వైద్య పద్ధతులు నేడు అందుబాటులో ఉన్నాయి. హెల్త్ ఇన్సూరెన్సుల ద్వారా అనేక రకాల క్యాన్సర్‌లకు ఉచిత వైద్య సేవలు లభిస్తున్నాయి. తాజా కూరగాయలు, ఆకు కూరలు తీసుకోవాలి. వీటిల్లో క్యాన్సర్ కారకాలతో పోరాడే యాంటిజెంట్స్ ఉంటాయి. మాంసాహారం తీసుకునేవారు తప్పనిసరిగా వెజిటబుల్ లేదా ఫ్రూట్ సలాడ్ తినాలి. క్యాన్సర్ కణాలతో సలాడ్‌లోని యాంటీజెంట్స్ పోరాడతాయి. ప్రతిరోజూ కనీసం అరగంటసేపు శారీరక వ్యాయామం చేయాలి. పొగ తాగడం, మద్యం, పాన్, గుట్కా లాంటి దురలవాట్లకు దూరండా ఉండాలి.

– డాక్టర్ ఎం.జి.నాగకిశోర్, సీనియర్ సర్జికల్ అంకాలజిస్ట్

ఉచితంగా కార్పొరేట్ వైద్య సేవలు



గుంటూరు జీజీహెచ్‌లోని నన్నపనేని లోకాదిత్యుడు, సీతారావమ్మ స్మారక నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో రోగులకు ఉచితంగా కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తున్నాం. సర్జికల్ ఆంకాలజీ, మెడికల్ ఆంకాలజీ, రేడియో థెరఫీ, న్యూక్లియర్ మెడిసిన్ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. నాట్కో ట్రస్టు, ప్రభుత్వ భాగస్వామ్యంలో రూ. 45 కోట్లతో రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా అత్యాధునిక వైద్య సౌకర్యాలతో క్యాన్సర్ సెంటర్‌ను నిర్మించాం. ఆపరేషన్లు సైతం పూర్తి ఉచితంగా చేస్తున్నాం. నాట్కో ట్రస్టు ఆధ్వర్యంలో మందులు కూడా ఉచితంగా అందిస్తున్నాం. రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో వైద్య సేవలు వినియోగించుకుంటున్నారు.

– యడ్లపాటి అశోక్‌కుమార్, నాట్కో సెంటర్ కో–ఆర్డినేటర్,

క్యాన్సర్ రాకుండా వ్యాక్సిన్లు



గర్భాశయ ముఖ ద్వారం, లివర్ క్యాన్సర్ సోకకుండా ముందస్తుగా వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. తొమ్మిదేళ్ల బాలిక నుంచి 20 ఏళ్ల యువతులు ముందస్తుగా వేయించుకోవడం ద్వారా గర్భాశయ ముఖ ద్వారం క్యాన్సర్ సోకదు. మ్యామోగ్రామ్ పరీక్ష ద్వారా రొమ్ము క్యాన్సర్‌ను ముందస్తుగానే గుర్తించి నివారించవచ్చు. అతి తక్కువ సమయంలో వ్యాధిని గుర్తించే ఆధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధి బారిన పడకుండా ముందస్తుగానే గుర్తించవచ్చు.

– డాక్టర్ బైరపనేని స్రవంతి, క్యాన్సర్ వైద్య నిపుణురాలు, గుంటూరు

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **3,400** గరిష్ఠం : రూ. **4,300**

మోడల్ ధర రూ. **3,900**

క్లుప్తంగా

13 నుంచి డీటీపీలో ఉచిత శిక్షణ

కొరిటెపాడు(గుంటూరు): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ నుంచి డీటీపీలో, 20వ తేదీ నుంచి టైలరింగ్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ప్రారంభిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ జి.బి.కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్‌లో 30 రోజులు, డీటీపీలో 45 రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. వయస్సు 19 నుంచి 45 సంవత్సరాల లోపు ఉండాలని సూచించారు. ఆసక్తి గల వారు తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, డీటీపీ కోసం 10వ తరగతి పాస్ లేదా ఫెయిల్ జిరాక్స్ కాపీతో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. వివరాలకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, ఓల్డ్ బ్యాంక్ వీధి, కొత్తపేట లేదా, 0863-2336912, 9700687696, 8125397953, 9949930155 నంబర్లను సంప్రదించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తెనాలి డబుల్ హార్స్ ప్రత్యేక అవుట్‌లెట్లు

తెనాలి: తెనాలి ఆటోనగర్, అనంతపురం జిల్లాలోని తాడిపత్రి, విజయవాడ దగ్గర్లోని గన్నవరం ఎయిర్‌పోర్ట్‌లో డిపార్చర్ బ్లాక్ వద్ద సోమవారం తెనాలి డబుల్‌హార్స్ బ్రాండ్ ప్రత్యేక అవుట్‌లెట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా తెనాలి డబుల్‌హార్స్ గ్రూప్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ మునగాల మోహన్ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ ఈ ప్రత్యేక అవుట్‌లెట్ల ద్వారా వినియోగదారులకు నేరుగా ఉత్తమ నాణ్యత కలిగిన ఉత్పత్తులను అందించేందుకు కృషిచేస్తున్నామని చెప్పారు. త్వరలోనే ప్రతి ఇంటికీ అవసరమైన అన్ని ఉత్పత్తులను ఒకేచోట అందించేందుకు 'కంప్లీట్ కిచెన్ బాస్కెట్'ను అందుబాటులోకి తీసుకురానున్నట్టు వెల్లడించారు. ఈ విస్తరణ తెనాలి డబుల్‌హార్స్ గ్రూప్ నాణ్యత, సంప్రదాయం, వినూత్న ఆహార ఉత్పత్తులపై ఉన్న నిబద్ధతను వెల్లడిస్తుందని తెలిపారు. తమను వినియోగదారులకు మరింత చేరువ చేస్తుందని వివరించారు.

పురుగులను 'నులి'మేద్దాం : కలెక్టర్



లక్ష్మీపురం: జాతీయ నులిపురుగుల నివారణ (ఈనెల 10న) దినోత్సవంలో భాగంగా సోమవారం తన చాంబర్‌లో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి జాతీయ ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2 నుంచి 19 సంవత్సరాల పిల్లలందరూ తప్పనిసరిగా ఆల్బెండజోల్ 400ఎంజీ బిళ్లలను చప్పరించి మింగాలని తెలిపారు. ఒకటి నుంచి రెండు సంవత్సరాల పిల్లలు అరమాత్ర మింగాలని తెలియజేశారు. ఈనెల 10న మింగని పిల్లలను 17న మింగించాలని చెప్పారు. మధ్యాహ్నం భోజనం అయిన తర్వాత గంట తేడాతో మాత్రలు ఇవ్వాలని సూచించారు. అంగన్వాడీ, ఆశా, ఆరోగ్య కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో డాక్టర్ కె.విజయలక్ష్మి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి మజీద్ ఆ బేగం డీసీహెచ్ఎస్, ఆర్‌బీఎస్‌కే కో–ఆర్డినేటర్ డాక్టర్ రోహిణి రత్నశ్రీ, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఏ. శ్రావణ్ బాబు, డాక్టర్ సీహెచ్ రత్న మన్మోహన్, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ దాసరి శ్రీనివాసులు, విజయలక్ష్మి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ రేణుక, జిల్లా విద్యాశాఖ అధికారి, ఆర్‌బీఎస్‌కే సిబ్బంది, డైక్ సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి వరకు బీఫార్మసీ,ఫార్మా-డీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్స్

బాపట్ల: ఫార్మసీ కళాశాలల్లో భర్తీ కాకుండా మిగిలిపోయిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లకు ఈనెల 5వ తేదీ వరకు అవకాశం కల్పించినట్లు ప్రిన్సిపల్ గోపాలకృష్ణమూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యాజమాన్య కోటా కేటగిరి బి విద్యార్థులు అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. కోటాలో సీట్లు పొందాలనుకునే విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

చేనేతలకు బడ్జెట్‌లో అరకొర

మంగళగిరి (తాడేపల్లి రూరల్) : ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో చేనేతలకు అరకొర మాత్రమే నిధులు కేటాయించారని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు విమర్శించారు. మంగళగిరి నగర పరిధిలోని ఏపీ చేనేత కార్మిక సంఘంరాష్ట్ర కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా చేనేత పరిశ్రమపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి 1.60 కోట్లమంది జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వీరికి కేవలం ముష్టివేసినట్లు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 200 కోట్ల రూపాయలు కేటాయించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జనాభా దామాషా ప్రకారం చూసినా 10 వేల కోట్ల రూపాయలు బడ్జెట్‌లో కేటాయించాల్సి ఉందని పేర్కొన్నారు. కేవలం ఎన్నికల సమయంలో చేనేతలకు అధిక నిధులు కేటాయిస్తామని, వారి అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పడం తప్పా ఆచరణలో ఎక్కడా అమలు జరగడం లేదని వివరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పునరాలోచించి చేనేతలకు, చేనేత పరిశ్రమలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో చేనేత కుటుంబాలు కేంద్రప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నట్లు హెచ్చరించారు. సమావేశంలో ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వెంకట కృష్ణారావు, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు, సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లడుతున్న ఏపీ చేనేత కార్మిక సంఘం నాయకులు

వైభవంగా సాయిబాబా మందిర వార్షికోత్సవం


శైవ క్షేత్రం పీఠాధిపతి శివస్వామికి సాయిబాబా చిత్రపటాన్ని అందజేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ పాతూరి నాగభూషణం తదితరులు

- పెదవడ్లపూడిలో పోటెత్తిన భక్తులు
- స్వామిని దర్శించుకున్న ప్రముఖులు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మంగళగిరి (తాడేపల్లి రూరల్): మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని పెదవడ్లపూడిలో గల భగవాన్ శ్రీ సత్య షిర్డీ సాయిబాబా మందిర 19వ వార్షికోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. బాబాను దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఉదయం స్వామికి క్షీరాభిషేకం నిర్వహించారు. చిన్నపిల్లలకు, పెద్దలకు వినోదాన్ని అందించే ఏర్పాటు చేసిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. రాష్ట్ర మంత్రి నిమ్మల రామానాయుడు, చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, శైవక్షేత్రం పీఠాధిపతి శివస్వామి సాయిబాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు రాజకీయ పార్టీల నాయకులు చిల్లపల్లి శ్రీనివాసరావు, గంజి చిరంజీవి, నందం అబద్ధయ్య, మాజీ శాసనసభ్యులు మల్లాది విష్ణులతో పాటు రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి సిసోడియా, బి.ఎస్.ఎస్.ప్రసాద్, ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ జనరల్ సెక్రటరి విద్యాసాగర్, ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ జీవీరెడ్డి, సిద్ధార్థ అకాడమి చైర్మన్ రాజయ్య, అంకబాబు, సినీ నిర్మాత ఆదిశేషగిరిరావు, చీకోటి ప్రవీణ్ స్వామివారి ఆశీస్సులను అందుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పాతూరి నాగభూషణం ఉత్సవాలను పర్యవేక్షించారు. భక్తులకు రామినేని ఫౌండేషన్ చైర్మన్, ధర్మ ప్రచారక్ ఆధ్వర్యంలో అన్నదానం చేసినట్లు నాగభూషణం తెలిపారు. హాజరైన ప్రముఖులకు శాలువాతో సత్కరించి, సాయిబాబా చిత్రపటాన్ని బహూకరించినట్లు ఆయన చెప్పారు.

దేవతలకు పట్టువస్త్రాలు బహూకరణ

బాపట్ల: పట్టణంలోని శ్రీ అష్టలక్ష్మీ దేవస్థానం 8వ వార్షికోత్సవం సందర్భంగా పలు దేవాలయాలకు పట్టు వస్త్రాలను కమిటీ సభ్యులు సోమవారం అందించారు. నరాలశెట్టివారిపాలెంలోని రామాలయం, పోలేరమ్మ తల్లి దేవాలయం, శ్రీభావన్నారాయణస్వామి దేవాలయం, కన్యకా పరమేశ్వరి దేవాలయంలోని దేవతలకు వస్త్రాలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో నరాలశెట్టివారి పాలెం మహిళలు పాల్గొన్నారు.

రేషన్ కార్డులు మహాప్రభో !

- అధికారంలోకి వచ్చి ఏడు నెలలు దాటినా కొత్త కార్డులు మంజూరు చేయని కూటమి ప్రభుత్వం
- సచివాలయాల చుట్టూ ప్రదక్షణలు చేస్తున్న పేదలు
- పట్టించుకోని అధికారులు



కొరిటెపాడు(గుంటూరు): కూటమి ప్రభుత్వం రేషన్ కార్డు దరఖాస్తుదారులకు షాక్ ఇచ్చింది. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు దాటినా వాటి ఊసూ లేదు. ఇప్పటి వరకు ఒక్కరికీ కూడా మంజూరు చేసిన దాఖలాలు లేవు. ప్రజలు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాకుండా దరఖాస్తులు స్వీకరించలేమని సిబ్బంది చెబుతుండటంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు. ప్రధానంగా కొత్త రేషన్ కార్డులతో పాటు ఉన్న వాటిల్లో అనేక తప్పులు దొర్లాయి. ఒకరి ఆస్తి పన్నుకు మరొకరి ఆధార్ కార్డును జత చేశారు. ఇల్లు లేకుండానే ఉన్నట్లు నమోదు చేశారు. కార్డుల్లో తప్పులున్న కారణంతో పలువురు పథకాలకు దూరమయ్యారు. అయినా రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులకు కూడా కూటమి ప్రభుత్వం ఇంకా అవకాశం కల్పించలేదు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దకే రేషన్ కార్డులు

అధికారంలోకి వచ్చేందుకు చాలా హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం.. గెలిచాక ప్రజల శ్రేయస్సును విస్మరిస్తోంది. ప్రభుత్వం ఏర్పడి నెలలు గడుస్తున్నా రేషన్ కార్డుల ఊసే ఎత్తడం లేదు. దీంతో దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో దరఖాస్తుదారులకు విరివిగా రేషన్‌కార్డులు అందజేసింది. సచివాలయాలను వేదికగా చేసుకుని గంటల వ్యవధిలోనే ఇచ్చి చరిత్ర సృష్టించింది. అది కాకుండా వలంటీర్లు కూడా అర్హుల ఇంటి వద్దకే వెళ్లి దరఖాస్తులు స్వీకరించారు. కార్డు మంజూరు అయ్యాక లబ్ధిదారులకు స్వయంగా అందజేశారు. వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మధ్యవర్తుల జోక్యం లేకుండా అర్హులకు రేషన్‌కార్డులు అందాయి. పారదర్శకతకు పెద్దపీట వేశారు.

పెదవి విరుస్తున్న ప్రజలు

2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వం అరకొరగా రేషన్‌కార్డులను మంజూరు చేసింది. అప్పట్లో జన్మభూమి కమిటీల పెత్తనంతో మంజూరయ్యేవి. దీంతో పలువురు అర్హులకు కార్డులు దక్కని పరిస్థితి నెలకొంది. రానివారు నిరాశకు గురయ్యారు. ప్రభుత్వ పథకాలకు దూరమయ్యారు. కనీసం నిత్యావసరాలు కూడా అందక ఇబ్బందులు పడ్డారు.మళ్లీ కార్డుల మంజూరులో కూటమి నేతలు జోక్యం చేసుకుంటే కోతలు పడే అవకాశాలున్నాయని ప్రజలు పెదవి విరుస్తున్నారు.

పాత కార్డులు తొలగింపు

కొత్త కార్డులు మాత్రమే కాదు.. ప్రస్తుతం ఉన్న కార్డుల స్థానంలో కొత్తవి పంపిణీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. కొత్త రేషన్ కార్డుల డిజైన్లను ఎంపిక చేసి ముద్రించి పంపిణీ చేయనున్నారు. ప్రస్తుతం ప్రజల దగ్గర ఉన్న కార్డులను పూర్తిగా మార్చనున్నట్లు సమాచారం. క్యూఆర్ కోడ్‌తో పాటు కుటుంబ సభ్యుల చిత్రాలతో వీటిని ముద్రిస్తారు. తల్లిదండ్రుల నుంచి విడిపోయిన వారు, ఒంటరిగా ఉన్న వారికి కూడా కార్డులు ఇస్తారు. వినియోగంలో లేని కార్డులను తొలగించి కొత్త కార్డులు జారీ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. కొందరు కార్డుదారులు ఐదు, ఆరు నెలలుగా రేషన్ సరుకులు తీసుకోవడం లేదని అధికారులు గుర్తించారు. వీటిని తొలగిస్తే ప్రభుత్వానికి ఆదా అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

ప్రభుత్వ పథకాలు అందడం లేదు



రేషన్ కార్డు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందడం లేదు. ఇప్పుడు ప్రతి పథకానికి రేషన్ కార్డ్ తీసుకుంటున్నారు. లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రేషన్ సరుకులు అందడం లేదు. ఎప్పుడు ఇస్తారో కూడా తెలియడం లేదు. సచివాలయం వద్దకు వెళ్తే.. ఇంకా మార్గదర్శకాలు రాలేదని చెబుతున్నారు. అసలు రేషన్ కార్డులు ఇస్తారా ? అనే అనుమానం వస్తోంది.

– ఎం.నరేంద్ర, కొరిటెపాడు

సాయిసాధన చిట్ ఫండ్ నిర్వాహకులపై కేసు

నరసరావుపేట టౌన్: సాయి సాధన చిట్ ఫండ్ నిర్వాహకులపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు నరసరావుపేట వన్ టౌన్ సీఐ విజయ చరణ్ సోమవారం తెలిపారు. మాజీ కౌన్సిలర్ వేలూరి సుబ్బారెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో పుల్లారావుతోపాటు అతని కుటుంబ సభ్యులు పాలడుగు వాణిశ్రీ, పాలడుగు పవన్ కుమార్, పాలడుగు హర్షవర్ధిని, నూకవరపు రాజా రమేష్, గాలి కోటయ్యలపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. తమ వద్ద చీటీలు, ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో రూ.2.80 కోట్లు పల్నాడు రోడ్‌లోని సాయి సాధన చిట్ ఫండ్ సంస్థ కట్టించుకుందని, తీరా నగదు చెల్లించే సమయంలో డబ్బులు ఇవ్వకుండా గత వారం రోజులుగా చిట్ ఫండ్ నిర్వాహకుడు పాలడుగు పుల్లారావు, అతని కుటుంబ సభ్యులు ఊరు నుంచి వెళ్లిపోయారని ఫిర్యాదులో సుబ్బారెడ్డి పేర్కొన్నాడని సీఐ తెలిపారు.